‘ప్రజాపాలన’ సజావుగా సాగేలా పటిష్ట చర్యలు

జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్



చిక్కడపల్లిలోని క్రేంద్రంలో వివరాలను తెలుసుకుంటున్న కమిషనర్ రొనాల్డ్ రాస్

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సజావుగా సాగేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లోని 89 వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సరైన సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. అనంతరం కమిషనర్ రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ... దరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, సర్కిల్–15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ఏఎంసీ ప్రవీణ్‌చంద్ర, ఎంహెచ్‌ఓ మైత్రేయి, అధికారులు అశోక్‌రెడ్డి, గోవర్ధన్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

అంబర్‌పేట: పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం అండగా నిలుస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న పటేల్‌నగర్‌కు చెందిన ఆసీమా బేగం కు మాజీ మంత్రి హరీష్‌రావు సహకారంతో రూ. 60 వేల చెక్కును మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు. శనివారం చెక్కును గోల్నాకలోని ఆయన కార్యాలయంలో బాధితురాలికి చెక్కును అందించి భరోసా ఇచ్చారు.

చలి.. కరోనా.. పరేషాన్!

- పెరుగుతున్న కోవిడ్ కేసులతో సర్వత్రా ఆందోళన
- చలి తీవ్రతతో మరింత ఇబ్బందికరంగా పరిస్థితులు
- జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలంటున్న వైద్యులు

తూర్పు తీరం నుంచి వీస్తున్న బలమైన శీతల గాలుల కారణంగా గడచిన వారం రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. వాతావరణ మార్పులతో ఇప్పటికే జలుబు, దగ్గు ఇతరత్రా వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇదిలా ఉంటే కరోనా మహమ్మారి సైతం విజృంభిస్తుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. కోవిడ్ కేసులు పెరుతున్నాయని.. జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వాలు చేస్తున్న హెచ్చరికలు మరింత వణుకు పుట్టిస్తున్నాయి.



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్ కోసం క్యూలో వేచి ఉన్న రోగులు

నల్లకుంట: నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరం బాధితులతో కిటకిటలాడుతున్నాయి. చలి పంజా విసురుతున్న క్రమంలో పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని, వీలైనంత మేరకు ఉదయం, సాయంత్రం ఆరుబయట తిరగొద్దని వైద్యులు సూచిస్తున్నారు. గాలులతో కూడిన చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు రోజులుగా బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. డిసెంబర్ మొదటి వారం నుంచే జలుబు, దగ్గు, జ్వర పీడితులు పెరిగిపోయారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు సతమతమవుతున్నారు. జాగ్రత్తలు పాటిస్తేనే కాస్త ఉపశమనం పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

కరోనా భయం...

- జలుబు, దగ్గు, జ్వరం, గొంతు సమస్యలు పెరుగుతున్న ఈ తరుణంలో కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్నదని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరికలు చేయడంతో జనంలో ఆందోళన నెలకొంది. కరోనా కొత్త వేరియంట్ (జేఎన్ 1) కారణంగా కేసులు పెరుగుతున్నాయని, మాస్కులు ధరించి అందరూ జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. నిర్లక్ష్యం వహిస్తే కరోనా బారిన పడతారని హెచ్చరిస్తుంది. చలితో వచ్చిన జ్వరం, జలుబుతో ఇబ్బంది పడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కరోనా వ్యాప్తి కారణంగా 10 ఏళ్ల లోపు పిల్లలు, గర్భిణులు, వృద్ధులు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని, వీలైనన్ని సార్లు చేతులు కడుక్కోవాలని, తప్పనిసరైతేనే ప్రయాణాలు చేయాలని పేర్కొంది.
- గడచిన వారం రోజులుగా నగరంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాధారణం కంటే సగటున ఒక ట్రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ నమోదవుతున్నాయి. దీంతో పాటు సాయంత్రం నుంచి ఉదయం వరకు బలంగా వీస్తున్న గాలులతో భరించలేని చలి వాతావరణం నెలకొంది. దీంతో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఈ రెండు, మూడు రోజుల్లోనే జ్వరం, జలుబు బాధితుల సంఖ్య విపరీతంగా పెరిగింది. తేమ కారణంగా వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోయి చాలా మందిలో శ్వాస సంబంధ సమస్యలు పెరుగుతున్నాయి. చాలా మందిని గొంతు నొప్పి పట్టిపీడిస్తున్నది.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండాలి



వాతావరణ మార్పుల కారణంగా ఫీవర్ ఆస్పత్రికి సీజనల్ వ్యాధుల కేసులు పెరుగుతున్నాయి. సీజనల్ వ్యాధులతో పాటు దేశంలో కోవిడ్ కేసులు కూడా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇంటి నుంచి బయటకు వస్తే మాస్కులు తప్పనిసరిగా ధరించాలి. పదేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు పైబడిన వారు, గర్భిణులు, దీర్ఘకాల రోగులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు. వీలైనన్ని ఎక్కువ సార్లు చేతులు శుభ్రం చేసుకోవాలి. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా ఇంటి లోపల వేడి వాతావరణం ఉండేలా చూసుకోవాలి. ఫీవర్ ఓపీ విభాగంలో నిత్యం 400 నుంచి 700 మంది వరకు వివిధ జబ్బులతో చికిత్సల కోసం వస్తున్నారు. సాధారణ వ్యాధుల పరీక్షలతో పాటు అనుమానితులకు కోవిడ్ ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆందోళన పడాల్సిన పరిస్థితులు లేకున్నా జాగ్రత్తగా ఉంటే ఎలాంటి ముప్పు ఉండదు.

– డాక్టర్‌కె.శంకర్, ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్

వసతుల కల్పనకు పెద్ద పీట



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

నల్లకుంట: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం నల్లకుంట డివిజన్ సంజీవ్‌నగర్‌లో రూ. 11 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గం వ్యాప్తంగా కాలం చెల్లిన పైప్‌లైన్ వ్యవస్థను తొలగించి కొత్త పైపులైన్ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. జలమండలి అధికారులు, స్థానిక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలి

కాచిగూడ: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మామిడాల రాజ్‌కిరణ్ అన్నారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో వివిధ ప్రాంతాల్లో పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను అందజేసి, అవసరమైన వారికి దరఖాస్తు ఫారాలు నింపి ఇచ్చారు. దరఖాస్తులు నింపే విషయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫేర్



వైజ్ఞానిక అంశాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ రూపారెడ్డి

అంబర్‌పేట్: విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెట్టేందుకు తాము వివిధ అంశాల్లో వారిని ప్రోత్సహిస్తున్నామని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రూపారెడ్డి తెలిపారు. శనివారం డీడీ కాలనీలో ఉన్న పాఠశాలలో విద్యార్థులు మైండ్రాయిడ్–2023 పేరిట నిర్వహించిన సైన్స్ ఫేర్‌ను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక అంశాలను పరిశీలించారు. పర్యావరణం, స్పేస్, సంస్కృతి తదితర అంశాలను విద్యార్థులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సులక్షణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దోపిడీ లేని సమాజం కోసం నాటి యువత పోరాటం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఒక మనిషి ఇంకో మనిషిని దోచుకోని దోపిడీ లేని సమాజం కోసం నాటి యువత పని చేసిందని ఇప్పటి యువత నిర్జీవంగా ఉంటుందని ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్ రావు అన్నారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యుద్ధం, కుల, జెండర్ హింస బాధితులకు అండగా ఉండాలని కోరుతూ కాలం గుండెచప్పుడు, సంస్కృతిక సమష్టి ఆధ్వర్యంలో శాంతి స్వప్నాలు పేరిట సాంస్కృతి సంఘీభావ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ... అప్పుడు ఏ చిన్న విషయం జరిగిన సమాజం స్పందించేదని నేడు నాకెందుకులే అనే ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు సంబంధించిన అనేక పాటలను గద్దర్ రాశారని ఆయన రాసిన పాటలు ప్రజల గుండెల్లో లోతుగా వెళ్లాయన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు బి.ప్రదీప్ మాట్లాడుతూ... ప్రపంచ శాంతి నెలకొనాలంటే యుద్ధాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కవి, గాయకుడు లెల్లె సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్, సఫా డైరెక్టర్ రుబీనామజార్, కాత్యాయని, సి.ఎల్.యాదగిరి తదితరులు పాల్గొని ప్రసంగించారు. మనోలా, కీర్తన, దివ్య, రజనీలు రాజ్య హింసపై చివరి వరకు పోరాడిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్‌పై గద్దర్ ఒక నిజమైన స్వప్నం అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు.

సందడిగా ‘ఆకాష్’ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు గురువులే బాధ్యత వహించాలని శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వంశీధర్‌రెడ్డి, డైరెక్టర్ ఈశ్వరయ్య అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్ హాల్‌లో బర్కత్‌పురాకు చెందిన శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాలకు చెందిన 8వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీవిద్యార్థులు తమ విద్యతో పాటు సంస్కృతిక కార్యక్రమాలు ఆటపాటల్లో పాల్గొనడం వల్ల వారిలో మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల డైరెక్టర్ సాయిరెడ్డి, సీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ధనలక్ష్మి

కాచిగూడ: తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ధనలక్ష్మీని నియమించినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు తెలిపారు. ధనలక్ష్మీ అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించామన్నారు. ఈ మేరకు శనివారం ఆమెకు నియామకపు పత్రాన్ని అందజేశారు.

బహుముఖ సాహిత్య ప్రతిభాశీలి భవానీదేవి

చిక్కడపల్లి: కథ నవల వ్యాసం జీవిత చరిత్ర తదితర భిన్న ప్రక్రియలలో బహుముఖ సాహిత్య ప్రతిభాశీలి చిల్లర భవానీదేవి అని ప్రముఖ కవి తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య గోపి అన్నారు. వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ లేఖిని రచయిత్ర వేదిక నిర్వహణలో రచయిత్రి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి జాతీయ పురస్కారం రచయిత్రి డాక్టర్ చిల్లర భవానీదేవికి ప్రదాన సభ శనివారం రాత్రి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ గోపి పురస్కారం బహూకరించి మాట్లాడారు. వంశీ రామరాజు రచనా అధ్యక్షత వహించిన సభలో వాసిరెడ్డి రచనల గురించి గంటి భానుమతి, నళిని, మాంగళగౌరీ సుందరీ, నాగమణి, కామేశ్వరి ప్రసంగించారు. రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి సభను నిర్వహించగా శైలజ సుంకరపల్లి పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా దరఖాస్తులు స్వీకరించాలి



అడిక్‌మెట్ వార్డు కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలోని ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కేంద్రాలను పరిశీలించారు. ముందుగా అడిక్‌మెట్ డివిజన్‌లోని వార్డు కార్యాలయం, రాంనగర్ డివిజన్‌లోని బాకారం నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మరో కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం అందించే అభయ హస్తం కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి, చేయూత, గృహజ్యోతి, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని వారికి ఎలాంటి అసౌక్యం కలగకుండా చూడాలని కోరారు. నేతలు ముఠా జైసింహ, అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, కొండపల్లి మాధవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, అబ్బు, యూసుఫ్, బాబు, డీఎంసీ తిప్పర్తి యాదయ్య పాల్గొన్నారు.

దరఖాస్తులను అందుబాటులో ఉంచాలి

కవాడిగూడ: ప్రజాపాలన కేంద్రాలలో ప్రజలకు అభయహస్తం దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులకు సూచించారు. కవాడిగూడ డివిజన్ తాళ్ల బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సెంటర్‌ను ఆయన సందర్శించారు. దరఖాస్తు దారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముషీరాబాద్ డీఎంసీ తిప్పర్తి యాదయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహా, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, రాజేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఉమ్రా యాత్రకు వెళ్తున్న భక్తులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముస్లింలు పవిత్రంగా భావించే ఉమ్రా యాత్రకు వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని విధాల సహకరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. భోలక్‌పూర్‌కు చెందిన రఫీక్ ఉద్దీన్, మహ్మద్ జాకీర్‌హుస్సేన్, షఫీ ఉద్దీన్, సయ్యద్ భార్యా, జలావుద్దీన్, ఎజాజ్‌లు శనివారం సౌదీ అరేబియా దేశంలోని ఉమ్రా యాత్రకు బయలుదేరిన వారిని బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు జునేద్‌బాగ్దాదీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం ఉమ్రా యాత్రకు భోలక్‌పూర్ నుంచి వందలాది మంది తరలివెళ్లి పవిత్ర మక్కాను సందర్శించి ప్రార్థనలు చేస్తారన్నారు. ఇతర దేశాలకు వెళ్లే భక్తులకు ప్రభుత్వం అండగా నిలిచి అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

ప్రజాపాలన కేంద్రాలను పెంచాలి



దోమలగూడ వార్డు కార్యాలయంలో కేంద్రాన్ని సందర్శించిన కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజాపాలన కేంద్రాలను పెంచాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అధికారులకు సూచించారు. శనివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ దరఖాస్తు దారులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కవాడిగూడలోని తాళ్లబస్తీ కమ్యూనిటి హాల్, ముగ్గుబస్తీ అంగన్‌వాడీకేంద్రం, బండమైసమ్మ నగర్ కమ్యూనిటీ హాల్, దోమలగూడలోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోవడానికి వస్తున్న నేపథ్యంలో ప్రతి సెంటర్‌లో కౌంటర్‌ల సంఖ్య పెంచాలని దరఖాస్తుకు ఒకరోజు ముందుగానే ఆయా బస్తీలలో దరఖాస్తు ఫారాలను లబ్దిదారులకు అందజేయాలని ఆమె కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ. ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరుశురాం, నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

కాచిగూడ: పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని ఆ పార్టీ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ మోతీలాల్ నెహ్రూనగర్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన సభలను విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రజలందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆయన కోరారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం శనివారం బాగ్‌లింగంపల్లిలోని నగర కార్యాలయంలో ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు లెనిన్, స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఆశయాలు కలిగిన పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ... అధ్యయనం, పోరాటం, చదువుతూ పోరాడు, చదువకై పోరాడు అనే నినాదాలతో శాస్త్రీయ విద్య, అందరికీ ఉపాధి అవకాశాల కోసం విద్యార్థుల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రమ్య, రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగేందర్, శ్రీమన్, ప్రశాంత్, వీరేందర్, యేసుదాసు, భావన, శివగణేష్, రాజు పాల్గొన్నారు.

నారాయణగూడలో...

కాచిగూడ: విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి ఎస్ఎఫ్ఐ అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నారాయణగూడలోని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ జెండాను ఎగురవేశారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు రమ్య, రమేష్, నాగేందర్, శ్రీమాన్, వీరేందర్, ఏసుదాసు, శివ గణేష్, భావన, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్యుకేషనల్ ఫెస్ట్

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెస్ట్ ఆకట్టుకుంది. జెసెఫెస్టా–2023 పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో విద్యార్థులు సైంటిఫిక్ పరిశోధనల ప్రతిభను ఫెస్ట్‌లో ప్రదర్శించారు. సైంటిఫిక్ పరిశోధనలు, ఆవిష్కరణలు ప్రాజెక్టులను తమ మేధాశక్తితో తయారుచేసి ప్రతిభను చాటుకున్నారు. సెయింట్ జోసెఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎండి సిరాజుద్దీన్ మాట్లాడుతూ... విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఏటా ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ రఘుమోహన్‌గౌడ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తులను అందుబాటులో ఉంచాలి



దరఖాస్తును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలలో రేషన్‌కార్డు దరఖాస్తుఫారాలు కూడా అందుబాటులో ఉంచాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని ప్రజాపాలన కేంద్రాలును ఆమె శనివారం సందర్శించారు. చాలా మంది ప్రజలు తమకు దరఖాస్తు ఫారాలు అందడం లేదని గడువులోపు ఎలా దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సిబ్బందితో మాట్లాడుతూ సరిపడే విధంగా దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. బీజేపీ నేతలు వినయకుమార్, ఉమేష్, సాయికుమార్‌స ఆనంద్‌రావు పాల్గొన్నారు.

వేడుకగా మల్లన్నకు ‘మైలపోలు’ పూజలు



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నల్లవెల్లి అంజిరెడ్డి తదితరులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ బాకారంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి (మల్లన్న) ఆలయంలో శనివారం మైలపోలు పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నల్లవెల్లి దంపతులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టం వేసి ఒగ్గు బాబురావుచే మల్లన్న జీవిత చరిత్రను వెల్లడించారు. ప్రతి సంవత్సరం మల్లన్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో రఘు, నాయకులు సురేష్‌కుమార్, రాజు, సూర్యప్రకాష్ ముదిరాజ్, రామానందరెడ్డి, రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, రఘు, వెంకటేశ్వర్‌రావులు పాల్గొన్నారు. మల్లన్న మైలపోలు పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఉద్యమకారులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆనాటి జేఏసీ చైర్మన్ నర్సయ్య

ముషీరాబాద్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అర్హులైన ఉద్యమకారులందరికీ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో ప్రకటించిన 250 గజాల ప్రకారం ఇంటి స్థలాలను ఇవ్వాలని ఆనాటి ముషీరాబాద్ జేఏసీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శనివారం రాంనగర్ మీ సేవా కేంద్రం వద్ద జరిగిన సమావేశంలో ఆనాటి ముషీరాబాద్ జేఏసీ చైర్మన్ ఎం.నర్సయ్య, కన్వీనర్‌లు టి.రవీందర్, కిరణ్‌కుమార్‌ల నేతృత్వంలో పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ... ఎఫ్ఐఆర్‌లో ఉన్న ఉద్యమకారులు యధావిధిగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఎఫ్ఐఆర్‌లో పేరులేని ఆనాటి చురుకైన ఉద్యమకారులు కూడా తమతమ దరఖాస్తులను అధికారులకు అందజేయాలని కోరారు. ముషీరాబాద్ ఉద్యమకారులందరు జనవరి 2వ తేదీన రాంనగర్ మీ సేవా కేంద్రం వద్ద జరిగే సమావేశానికి తప్పక హాజరై తమతమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. ఆనాటి ముషీరాబాద్ జేఏసీ నాయకులు వెల్లంకి ఇంద్రసేనారెడ్డి, ముదిగొండ మురళీ, నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, బాలరాజుగౌడ్, కరుణాకర్, అజయ్ ముదిరాజ్, బుజ్జి వెంకటేశ్వర్‌రావు, కేబుల్ రవి, రవికుమార్, ఎర్రం శేఖర్, భిక్షపతి యాదవ్, నర్సింగ్ ముదిరాజ్, చంద్రమౌళి, కె.వెంకటేశ్వర్లు, జైపాల్‌రెడ్డి, బూడిద లక్ష్మణ్‌గౌడ్, సహదేవ్, ప్రేమ్, సుధాకర్ పాల్గొన్నారు.

సంస్కృత సమ్మేళనాలను దేశ వ్యాప్తంగా నిర్వహించాలి

కాచిగూడ: సంస్కృత సమ్మేళనాలను దేశ వ్యాప్తంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. కాచిగూడలోని తుల్జాభవన్‌లో శనివారం జరిగిన సంస్కృత సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. విఖ్యాత సంస్కృత పండితులు బ్రహ్మశ్రీ డాక్టర్ దోర్బల ప్రభాకర శర్మ నేతృత్వంలో ఈ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా గీతామూర్తి మాట్లాడుతూ... ప్రపంచంలోనే సంస్కృత భాష తల్లిలాంటిదని, ఇక్కడి నుండే వేరే అన్ని భాషలు మొదలయ్యాయన్నారు. ఇలాంటి ఉన్నతమైన భాషను దేశం మొత్తం గౌరవిస్తూ ఉంటుందని అన్నారు. బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రీ, దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్లు కృష్ణవేణి, జ్యోతి, తుల్జాభవన్ ఈఓ ఎస్.అంజనారెడ్డి, దర్శనం వెంకటరమణ శర్మ, మీనాక్షి గిరిధారి, ప్రవీణ్ కులకర్ణి, నాగరాజు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.